తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-22- ఏప్రిల్ 2025 | సంపుటి : 2 | సంచిక : 299 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in







## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

క్రైస్తవ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూశారు. వాటికన్ సిటీలో ఆయన కన్నుమూశారు. 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం ఈస్టర్ వేడుకలకు హాజరయ్యారు. ఈస్టర్ సందేశం కూడా ఇచ్చారు. గత కొంతకాలంగా పోప్ శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నారు. 2013లో ఫ్రాన్సిస్ పోప్‌గా బాధ్యతలు చేపట్టారు. 1936లో లాటిన్ అమెరికా దేశం అర్జెంటీనాలో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. లాటిన్ అమెరికా నుంచి పోప్‌గా ఎంపికైన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు. పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రపంచం ఘననివాళి అర్పిస్తోంది. ప్రధాని మోదీతో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

మిగతా 2లో..



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ప్రారంభించిన రేవంత్

### పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

**తెలంగాణ ముచ్చట్లు:**

జపాన్ లో జరిగిన వరల్డ్ ఎక్స్‌పో2025 వేదికగా రాష్ట్ర పెట్టుబడి అవకాశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన ప్రతిష్టాత్మక ఎక్స్‌పో2025లో ముఖ్యమంత్రి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం భాగస్వామిగా పాల్గొంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, వరల్డ్ ఎక్స్‌పోలో భారతదేశం నుంచి మొట్టమొదటిగా పాల్గొన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఇది గర్వకారణమని తెలిపారు. తెలంగాణ -జపాన్ మధ్య ఉన్న చారిత్రక స్నేహ బంధాన్ని దీర్ఘకాలిక భాగస్వామ్యంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్తు ప్రణాళికలను రూపుదిద్దుకునే దిశగా కలిసి పనిచేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన పాలన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణకు పెట్టుబడులకు ఆకర్షణగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. “హైదరాబాద్‌కు రండి, మీ ఉత్పత్తులు ఇక్కడ తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి” అంటూ జపాన్ కంపెనీలను ఆహ్వానించారు. తెలంగాణ - జపాన్ మధ్య ఉన్న మంచి సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయానికి ఇది నాంది కావచ్చని అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఒసాకా, అంతర్జాతీయంగా మిగతా భాగస్వాములతో కలసి అద్భుత భవిష్యత్తును నిర్మిద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో 30,000 ఎకరాల విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. ఇది ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇందులో భాగంగా జపాన్‌కు చెందిన మరుబేని కార్పొరేషన్‌తో కలిసి ఒక ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల పొడవైన రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. అంతర్జాతీయ ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ నది పునరుజ్జీవంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధికి జపాన్ నగరాలైన టోక్యో, ఒసాకాల శ్రేష్ఠమైన అనుభవాల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ ఇప్పటికే ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని గుర్తుచేస్తూ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో పెట్టుబడులకు అనువైన వాతావరణం రాష్ట్రంలో నెలకొన్నదని వివరించారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ, నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ'ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇది ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.



## గుజరాత్ ఆరో విజయం

ఐపీఎల్ 18 (IPL) సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (Kolkata Knight Riders)ను గుజరాత్ టైటాన్స్ (Gujarat Titans) 39 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ సీజన్‌లో విజయాల పరంపర కొనసాగిస్తున్న గుజరాత్ ఆరో విజయం సాధించింది.

6లో..

## లక్ష కోట్లు కాళేశ్వరం.. మూడేళ్లకే కూలిపోయింది

### మంత్రి ఉత్తమ్



**తెలంగాణ ముచ్చట్లు:**

పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి (Uttam Kumar Reddy) తెలిపారు. నిజామాబాద్‌లో 'రైతు మహోత్సవం' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా.. అదనంగా ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని విమర్శించారు.

మిగతా 2లో..

## కేసీఆర్‌కు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య వారధిగా ఉంటా

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణను కాపాడటమే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, పార్టీ కార్యకర్తలకు వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, ఏ చిన్న అవసరమున్నా తనను కార్యకర్తలు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడాన్ని బాధ్యతగా భావిస్తానని స్పష్టం చేశారు.

ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. మన కళ్ల ముందే మన తెలంగాణ ఆగమవుతుంటే చూస్తూ ఊరుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అప్పులపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విపరీతమైన అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు.

2004లో చచ్చిన పీనుగులా ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్లు ప్రజలను ఏడిపించిందని అన్నారు. వందలాది మంది బిడ్డలను పొట్టనపెట్టుకొని తెలంగాణ ఇచ్చారు తప్పా ఉట్టిగా ఇవ్వలేదని అన్నారు. లక్షా 60 వేల కోట్లకుపైగా అప్పు తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని తెలిపారు. తెచ్చిన రుణాన్ని ఏం చేశారని అడిగితే చెప్పబోమని అంటున్నారని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?

### ఆ మూడు పార్టీల నిజస్వరూపం బయటపెట్టాలనే బీజేపీ పోటీ : కిషన్ రెడ్డి



**తెలంగాణ ముచ్చట్లు:**

ఏప్రిల్ 23న హైదరాబాద్‌లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడం లేదో ప్రజలకు వివరించాలని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని ఎంచుకోవడం ద్వారా కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం అభ్యర్థిని గెలిపించడానికి ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు ఆరోపించారు.

మిగతా 2లో..

## ఇన్ని రోజుల నుంచి రైతు సమస్య తెల్వదా?

### భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో దేవరకొండ ఆర్డీవోపై పొంగులేటి తీవ్ర ఆగ్రహం



**తెలంగాణ ముచ్చట్లు:**

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి అధికారులపై ఆగ్రహంతో ఊగిపోయారు. ఇటీవల అకారణంగా కరీంనగర్ కలెక్టర్‌పై సీరియస్ అయిన మంత్రి.. తాజాగా నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిపై అదే రేతిలో మాట్లాడటంతో రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి.

మిగతా 2లో..



## 24న పట్టాలెక్కనున్న నమో భారత్

**ఢిల్లీ:**

దేశంలో 16 బోగీలతో తొలి నమో భారత్ ర్యాపిడ్ రైలు (Namo Bharat Rapid Rail) పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 24న ప్రధాని నరేంద్ర మోదీ (PM Modi) ప్రారంభించనున్నారు. బిహార్‌లోని జయ్‌నగర్ పట్నా స్టేషన్ల మధ్య ఈ రైలు సేవలందించనుందని కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలోనే తొలి నమో భారత్ రైలు గతేడాది సెప్టెంబర్‌లో అహ్మదాబాద్ భుజ్ స్టేషన్ల మధ్య ప్రారంభమైనప్పటికీ.. అందులో కేవలం 12 కోచ్‌లు మాత్రమే ఉన్నాయి. ఎక్కువ మంది ప్రయాణికులకు సేవలందించేలా కోచ్‌ల సంఖ్యను పెంచాలని నిర్ణయించిన రైల్వే అధికారులు.. తాజాగా 16 కోచ్‌లతో కొత్త రైలును సిద్ధం చేశారు. అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దిన నమో భారత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నట్లు రైల్వే బోర్డు అధికారి దిలీప్ కుమార్ వెల్లడించారు. 16 కోచ్‌లతో నడిచే తొలి నమో భారత్ రైలు ఇదేనన్నారు. ఈ రైలు గరిష్ఠంగా 110కి.మీ.ల వేగంతో పరుగులు పెడుతుందని, తద్వారా ప్రయాణ సమయం దాదాపు సగానికి తగ్గుతుందన్నారు. దీంతో ఉద్యోగ, వ్యాపార, విద్య అవసరాల కోసం పట్నావైపు వెళ్లే ఉత్తర బిహార్‌లోని సామాన్య ప్రజలకు ఈ రైలు వేగవంతమైన, సురక్షిత, సౌకర్యమంతమైన ప్రయాణాన్ని అందిస్తుందని తెలిపారు.

మిగతా 2లో..

## ఆల్‌టైమ్ హైకి చేరుకున్న బంగారం ధరలు



**తెలంగాణ ముచ్చట్లు:**

ప్రపంచ మార్కెట్ల ప్రకారం చూస్తే ప్రస్తుతం పసిడికి మంచి రోజులు వచ్చినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే వీటి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. ఈ క్రమంలోనే నేడు (ఏప్రిల్ 21న) స్పాట్ గోల్డ్ ధర ఒక్కసారిగా 1.7% ఎగబాకి ఔన్స్‌కి $3,383.87 స్థాయికి చేరుకుంది. దీనికి ముందు సెషన్‌లో $3,384 ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిని తాకింది.

మిగతా 2లో..

## కేటీఆర్‌కు ఈటల సవాల్



**తెలంగాణ ముచ్చట్లు:**

టీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకరికొకరు ప్రతిపక్షం అని చెప్పుకుంటారు... బీజేపీ వేగాన్ని తట్టుకోలేక మీదికి కొట్టుకుంటూ లోపల కలిసి ఉంటారని ఎంపీ ఈటల రాజేందర్విమర్శించారు. ఎమ్ఎమ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ అన్నీ కుటుంబ పార్టీలని.. బీజేపీ ఒక్కటే ప్రజాస్వామ్య పార్టీ అని చెప్పారు. చాయ్ అమ్ముకునే వ్యక్తిని బీజేపీ ప్రధాన మంత్రిని చేసిందని గుర్తుచేశారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా నిలబెడితే ఓడిపోతామని తెలిసి కూడా తట్టుకోలేక పోటీ పెట్టారని అన్నారు. దళిత బిడ్డ రామ్నాథ్ కోవింద్ మీద కూడా పోటీ పెట్టారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్ఎమ్ పార్టీలన్నీ ఒకే తాను ముక్కలని చెప్పారు. ప్రస్తుతం బెంగాల్లో ఏం జరుగుతుందో అందరూ చూస్తున్నారు.. హైదరాబాద్ కూడా అలా మారాలంటే ఎమ్ఐఎం ఓటు వేయాలని కార్పొరేటర్లకు సూచించారు. హైదరాబాద్లో వక్స్ పేరు మీద వేల కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయని అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి పోప్ ఎవరు ? పోప్ ఫ్రాన్సిస్ మరణంతో కొత్త పోప్ రేసు ప్రారంభమయ్యింది. ఇటలీకి చెందిన పియట్రో పెరొలిన్ రేసులో ముందున్నారు. ఘనాకు చెందిన పీటర్ టర్క్‌సన్ నుంచి ఆయనకు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. వీళ్లిద్దరు కూడా పోప్ ఫ్రాన్సిస్‌కు గట్టి మద్దతుదారులు. కార్డినల్ పీటర్ టర్క్‌సన్ ఆఫ్రికాలో క్యాథలిక్స్ కోసం ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఫిలిప్పీన్స్‌కు చెందిన కార్డినల్ లూయిస్ ఆంటోనియో కూడా పోప్ పదవి చేపట్టే అవకాశం ఉంది. హంగరీకి చెందిన పీటర్ హర్డో , ఉక్రెయిన్‌కు చెందిన మైకోల బైచోక్ కూడా పోప్ పదవి కోసం పోటీ పడుతున్నారు.

పోప్ చనిపోయిన నాటి నుంచి కొత్త పోప్‌ను ఎన్నుకునేంత వరకు ఉండే సమయాన్ని లాటిన్ భాషలో సెడె వెకెంటే అంటారు. పీఠం ఖాళీగా ఉందని దీనర్థం. ఈ సమయంలో కాలేజీ ఆఫ్ కార్డినల్స్ వాటికన్ వ్యవహారాలు చూస్తాయి. కాని ముఖ్య నిర్ణయాలు మాత్రం తీసుకోదు. కొత్త పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ రెండు, మూడు వారాల్లో ప్రారంభమవుతుంది. కొత్త పోప్ ఎన్నిక వ్యవహారం చాలా రహస్యంగా జరుగుతుంది. ఆయనను ఎన్నుకునే సభ్యుల బృందాన్ని కాంక్లేవ్ అంటారు. 80 ఏళ్లలోపు వయస్సున్న కార్డినల్స్‌కు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ఈ ఓటింగ్ అనేక దఫాలుగా జరుగుతుంది.

**మొత్తం 138 మంది కార్డినల్స్**

ప్రస్తుతమున్న కార్డినల్స్‌లో 80 శాతం మందిని పోప్ ఫ్రాన్సిస్సే నియమించారు. మొత్తం 138 మంది కార్డినల్స్ ఉన్నారు. ఇందులో భారత్ నుంచి నలుగురు ఉన్నారు. హైదరాబాద్ ఆర్చ్‌బిషప్ పూల ఆంథోని అందులో ఒకరు. ఆయనతో పాటు గోవా కార్డినల్ ఫిలెప్పి నెరీ ఫెరారో , కేరళకు చెందిన కార్డినల్ క్లీమీస్ బసేలియోస్ , జార్జ్ జాకబ్ పోప్ ఎన్నిక ఓటింగ్‌కు హాజరవుతారు.

కార్డినల్ పూల ఆంథోని అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. దళిత వర్గం నుంచి ఈ స్థాయికి ఎదిగిన తొలి భారతీయ కార్డినల్‌గా ఆయన రికార్డు సృష్టించారు. పోప్‌గా ఎన్నికయ్యే వ్యక్తికి మూడింట రెండొంతల మెజార్టీ రావాలి. ఒకవేళ నిర్ణయం తీసుకోని పక్షంలో వాటికన్ సిస్టైన్ చాపెల్ చిమ్నీ నుంచి నల్లటి పొగ విడుదల చేస్తారు. దానర్థం ఓటింగ్ ఇంకా కొనసాగుతోందని అర్థం.

ఒకవేళ పోప్‌ను కార్డినల్స్ ఎన్నుకున్నట్టు అయితే సిస్టైన్ చాపెల్ నుంచి తెల్ల పొగ విడుదల చేస్తారు. కొత్తగా ఎన్నుకున్న వ్యక్తిని ఆ బాధ్యతలు చేపట్టేందుకు సుముఖంగా ఉన్నారా అని అడుగుతారు. వారు ఒప్పుకున్నట్టు అయితే వాటికన్ సెయింట్ పీటర్స్ బెసిలికా బాల్కనీ నుంచి ఆయనను ప్రపంచానికి పరిచయం చేస్తారు. పోప్‌గా ఆయనకు కొత్త పేరు పెడతారు.

# లక్ష కోట్లు కాళేశ్వరం.. మూడేళ్లకే కూలిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పారు.

“ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మరిన్ని చెక్ డ్యామ్‌లు మంజూరు చేస్తాం. రైతు పక్షపాతిగా ఈ ప్రభుత్వం సాగుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం నిర్మించారు. భారాస నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది’’ అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

**రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలు నిలిపివేశారు: మంత్రి తుమ్మల**

పసుపు పంటకు మద్దతు ధర వస్తేనే.. పసుపు రైతు తలెత్తుకుని ఉండగలడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (Tummala Nageswara Rao) అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటి వచ్చే రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.

“గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలను నిలిపివేసింది. అకాల వర్షాలకు పంట నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తాం. భారాస హయాంలో పదేళ్ల పాటు వ్యవసాయ యంత్ర పరికరాలను ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని పునరుద్ధరించింది. ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ సాగు పెరగాల్సి ఉంది. 4 ఎకరాల వరి సాగుతో వచ్చే లాభం ఎకరం ఆయిల్‌పామ్ తోటతో వస్తుంది’’అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ఖబడ్దార్ తీన్మార్ మల్లన్న

తెలంగాణ ముచ్చట్లు:

తీన్మార్ మల్లన్న ఖబడ్దార్. సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి నోరు జారితే ఊరుకునేది లేదని తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ హెచ్చరికలు జారీ చేశారు. గత వారం నిర్వహించిన బీసీ చైతన్య సభలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా నోటిఫికేషన్లు జారీ చేస్తే సీఎం రేవంత్ రెడ్డి కుర్చీని లాగేస్తామని హెచ్చరించారు. సోమవారం తెలంగాణ ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ స్పందించారు. సీఎంను విమర్శించే స్థాయి తీర్మార్ మల్లన్నకు లేదన్నారు. దమ్ముంటే ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ రాజకీయ వ్యభిచారి ఎవరైనా ఉన్నారంటే అది తీన్మార్ మల్లన్నే. నేను రాజీనామా చేస్తా ఇద్దరం కలిసి పోటీ చేద్దాం. తెలంగాణ రాష్ట్రాన్ని బీసీల నాయకత్వం పెంపొందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఎన్నిసార్లు రేవంత్ కాళ్ళు మొక్కావో గుర్తులేదా. అధిష్టానం రాష్ట్ర రాజకీయ నాయకులను ఒప్పించి రేవంత్ నీకు ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించారు. స్పీకర్ ఫార్మాట్‌లో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి నీ దమ్ము ఏంటో నిరూపించుకో. ఎన్ని పార్టీలు మారావో గుర్తుందా. బీసీల ముసుగులో చిల్లర పనులు చేస్తూ బిసిలను ఇబ్బందులకు గురి చేయడానికి సిగ్గుండాలి. నీది నా కంటే దిగువ స్థాయి.. సీఎం రేవంత్ రెడ్డితో పోల్చుకునే స్థాయి నీకు లేదు. ఇప్పటికైనా నీ స్థాయికి తగ్గట్లు మాట్లాడటం నేర్చుకో. బీజేపీ నేతలకు గులాంగిరి చేసుకో. ఉదయం బీజేపీ, సాయంత్రం బీఆర్ఎస్ భజన చేసుకో' అని ధ్వజమెత్తారు.

# హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎందుకు పోటీ చేయడం లేదు?

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని AIMIM బలమైన ప్రదేశాలలో BRS మరియు కాంగ్రెస్ అసెంబ్లీ మరియు లోక్‌సభ ఎన్నికలలో అభ్యర్థులను నిలబెట్టాయని, వారికి డిపాజిట్లు రావని తెలిసినప్పటికీ, AIMIM వ్యతిరేక ఓటును చీల్చడానికి మాత్రమే అని ఆయన ఆరోపించారు.

"నేను ఈ రోజు అడగాలనుకుంటున్నాను కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదు? వారు తెలంగాణ ప్రజలకు మరియు దేశ ప్రజలకు చెప్పాలి" అని కిషన్ రెడ్డి పిటిఐ వీడియోలతో అన్నారు.

"లౌకికవాదాన్ని కాపాడటానికి" పనిచేస్తున్నానని చెప్పుకునే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, "ముఖ్యమైన మతతత్వ పార్టీ" అయిన AIMIM తో కాంగ్రెస్ ఎందుకు కలిసి పనిచేస్తుందో సమాధానం చెప్పాలని ఆయన ఆరోపించారు.

"కాంగ్రెస్ మరియు BRS (MLC పోల్‌లో) AIMIM అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాయి. వారు అతనిని గెలిపించడానికి ప్రయత్నిస్తున్నారు. BRS లేదా కాంగ్రెస్ రెండూ AIMIMకి వ్యతిరేకంగా పోరాడటం లేదు. రెండూ AIMIM పాటలకు నృత్యం చేస్తున్నాయి. రెండు పార్టీలు AIMIM యొక్క రౌడీయిజానికి మద్దతు ఇస్తున్నాయి. వారు AIMIM యొక్క మతతత్వానికి మద్దతు ఇస్తున్నారు" అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

AIMIMను సవాలు చేస్తూ MLC ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఏకైక పార్టీ BJP అని ఆయన అన్నారు. ఇంతలో, "కాంగ్రెస్ AIMIMకి మద్దతు ఇస్తోందనే" ఆరోపణను రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు B మహేష్ కుమార్ గౌడ్ తోసిపుచ్చారు.బిజెపి, కిషన్ రెడ్డి "అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వకుండా మతం పేరుతో ఓట్లు కోరుతున్నారు" అని ఆయన ఆరోపించారు.

హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి శాసన మండలికి ఏప్రిల్ 23న ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల్లో పోటీ బీజేపీకి చెందిన ఎన్. గౌతమ్ రావు మరియు AIMIM అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి మధ్య ఉంది. కాంగ్రెస్ మరియు BRS అభ్యర్థులను నిలబెట్టలేదు.

# 24న పట్టాలెక్కనున్న నమో భారత్

ఇందులో అన్నీ ఏసీ కోచ్‌లేనని.. దాదాపు 2 వేల సీటింగ్ సామర్థ్యంతో ఈ రైలు నడుస్తుందని తెలిపారు. మరో వెయ్యి మంది నిలబడి ప్రయాణించవచ్చని తెలిపారు. రైలు నడుస్తున్న సమయంలో నిలబడినవారు బ్యాలెన్స్ కోల్పోకుండా ఉండేందుకు హ్యాండ్ రెయిల్స్, పట్టీలు లేదా స్తంభాలను సైతం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, టైప్‌సి, టైప్ ఎ ఛార్జింగ్ పాయింట్లతో పాటు పూర్తిస్థాయిలో ఏసీ క్యాబిన్‌లు, మాడ్యులర్ ఇంటీరియర్స్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. కవచ్ భద్రతా వ్యవస్థ, సీసీటీవీలు, అగ్నిప్రమాదాన్ని గుర్తించే వ్యవస్థ, రెండు వైపులా ఇంజిన్‌లు (పుష్‌పుల్), రైలు చేరుకొనే ప్రతి స్టేషన్ సమాచారాన్ని ప్రదర్శించే రూట్‌మ్యాప్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి.

# కేసీఆర్‌కు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య వారధిగా ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

తెచ్చిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

40 వేల కోట్ల విలువైన భూములను 10 వేల కోట్లకు ప్రభుత్వం తాకట్టు పెట్టిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 10 వేల కోట్లతో రైతు భరోసా, రుణమాఫీ చేశామని మంత్రులు చెబుతున్నారు కానీ ఇప్పటికీ 60 శాతం మందికి రుణ మాఫీ కాలేదు, 50 శాతం మందికి రైతు భరోసా రాలేదని పేర్కొన్నారు. మరి ఈ 10 వేల కోట్లు ఎక్కడ పోయినట్లు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. ప్రస్తుత పాలకులు చూడటానికి తెలంగాణ వ్యక్తుల్లా ఉంటారు... కానీ పనిచేసేది తెలంగాణకు వ్యతిరేకంగా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక కల్లిబొల్లి మాటలు చెప్పింది.. లేనిపోని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.

అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌ది అని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క సెకండ్ కూడా విశ్రాంతి తీసుకోకుండా కేసీఆర్ పని చేశారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామ రక్ష అని అన్నారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే ఖమ్మం జిల్లా నుంచి అని చెప్పారు. 1969లో ఖమ్మంలో మొదలైన తెలంగాణ ఉద్యమం రాష్ట్రమంతా పాకిందని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని విమర్శించారు. భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదే అని చెప్పారు. అలాంటి ద్రోహులను చాలామందిని చూశామని.. కుట్రలను చూశామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఏమరపాటుగా ఉంటే కచ్చితంగా తెలంగాణను కాంగ్రెస్ ఆగం చేస్తుందని అన్నారు.

# రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

తెలంగాణ ముచ్చట్లు:

కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల వ్యవస్థ రాజీ పడినట్లు కనిపిస్తోందని, ఆ వ్యవస్థలోనే ఏదో తప్పు ఉందంటూ వ్యాఖ్యానించారాయన. ఈ క్రమంలో మహారాష్ట్ర ఎన్నికల ప్రస్తావననూ ఆయన తీసుకొచ్చారు.

అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ (Rahul Gandhi).. ఆదివారం బోస్టన్‌లో ప్రవాస భారతీయులు పాల్గొన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. ‘‘ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో (Maharashtra Election Fraud) 5.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య 65 లక్షల మంది ఓటు వేసినట్లు ఎన్నికల సంఘం చెప్పింది. ఒక్కో ఓటర్ ఓటు వేయడానికి 3 నిమిషాల సమయం పడుతుంది. అలాంటప్పుడు అంత తక్కువ వ్యవధిలో అంతమంది ఎలా ఓటు వేయగలరు?. అక్కడ ఏదో తప్పు జరిగిందని స్పష్టంగా



తెలుస్తోంది’’ అని రాహుల్ అన్నారు.

‘‘ఎన్నికల సంఘం (Election Commission) రాజీ పడినట్లు ఇక్కడే అర్థమవుతోంది. ఆ వ్యవస్థలోనే ఏదో తప్పిదం ఉంది. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు ప్రస్తావించాను. మహా ఎన్నికలకు సంబంధించిన వీడియోలు చూపించాలని మేం అడిగాం. అందుకు ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగడానికి వీలు లేదంటూ చట్టాన్ని కూడా మార్చేశారు’’ అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే వేదికగా ఆయన అమెరికా భారత్ మధ్య సంబంధాల గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్.. సోమవారం బ్రౌన్ యూనివర్సిటీలో ప్రసంగించనున్నారు.

ఇదిలా ఉంటే.. రాహుల్ గాంధీ ఈసీపై ఈ తరహా ఆరోపణలు చేయడం ఇదే తొలిసారి కాదు. అయితే.. రాహుల్ సహా పలువురు ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తోంది. మరీ ముఖ్యంగా ఈవీఎంలను మేనేజ్ చేయొచ్చనే ఆరోపణలను కూడా తోసిపుచ్చుతూ వస్తోంది. అయినప్పటికీ వరుసగా ఆయా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, ఓటర్ల జాబితాల ఆధారంగా ప్రతిపక్షాలు ఈసీపై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి.

# కేటీఆర్‌కు ఈటల సవాల్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్, బీఆర్ఎస్ తాటాకు చప్పుళ్లకు భయపడేది కాదు బీజేపీ.. దేశహితం బీజేపీ సిద్ధాంతమని చెప్పారు. కార్పొరేటర్లారా చూస్తూ చూస్తూ బొందల పడకండి అని అన్నారు. 'బాంబుల మోతలు, ఎగిరిపడ్డ మాంసం ముద్దలు లేకుండా ఉండాలంటే బీజేపీకి మద్దతు ఇవ్వండి' అని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత, ఆడబిడ్డలను కాపాడాలని కోరుతున్నట్లు చెప్పారు. బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా అది దేశం కోసమే అని అన్నారు. పదేళ్ల బీజేపీ పాలన మీద అబిడ్స్ చౌరస్తాలో చర్చకు రావాలని కేటీఆర్ (KTR) కు సవాల్ చేశారు. అనవసరంగా పదే పదే కేంద్రం నిధులు ఇవ్వడం లేదని గగ్గోలు పెట్టడం, ఫాల్స్ మాటలు మాట్లాడటం కాదు.. దమ్ముంటే చర్చకు చెబుతా అని ఛాలెంజ్ చేశారు. సీఎం, మంత్రులు ఇతర దేశాలకు వెళ్లినప్పుడల్లా వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చామని గొప్పలు చెప్పుకోవడమే కానీ.. ఇప్పటివరకు ఒక్కటి రాలేదని అన్నారు.

# ఇన్ని రోజుల నుంచి రైతు సమస్య తెల్వదా?

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం నల్లగొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మీటింగ్‌లో భాగంగా రైతులు తమ భూ సమస్యలపై మాట్లాడేందుకు అధికారులు మైక్ ఇచ్చారు. దీంతో ఒక రైతు తన భూమి సమస్యను మంత్రికి వివరించే ప్రయత్నం చేశారు. దీనిపై వెంటనే మంత్రి స్పందిస్తూ.. సదరు రైతు సమస్యకు సమాధానం చెప్పాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆ రైతు సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో సమాధానం ఇచ్చారు. దీంతో మంత్రి పొంగులేటి ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ‘ఇక్కడ ఎన్ని నెలల నుంచి పనిచేస్తున్నావు? ఆరు నెలలుగా ఇక్కడే ఉంటున్నావు కదా? అతని సమస్య నీకెందుకు తెలవదు? ఏం చేస్తున్నావు.. ఇన్ని రోజుల నుంచి? ఇంకెప్పుడు తెలుసుకుంటావు?’ అం టూ మంత్రి ఫైరయ్యారు.

నిజానికి సదరు రైతు పేర్కొన్న సమస్య ఆర్డీవో స్థాయి అధికారి జవాబు చెప్పాల్సినది కాదని, మండల పరిధిలోని తహసీల్దార్ సమాధానం చెప్పాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. కానీ, మంత్రి మాత్రం తహసీల్దార్‌ను కాకుండా ఆర్డీవోను సమాధానం చె ప్పాలని కోరడంపై రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. అయితే విధుల్లో సమర్థుడైన అధికారిగా సదరు ఆర్డీవోకు పేరున్నట్టు రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంపై దేవరకొండ డివిజన్‌లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ తండాల్లో ఉన్న గిరిజనులకు సైతం అర్థమయ్యేలా ఆర్డీవో రమణారెడ్డి చొరవ తీసుకుని పని చేస్తున్నారని అంటున్నారు. అధికారుల పనితీరు తెలుసుకోకుండానే ఇష్టానుసారంగా మాట్లాడటం మంత్రికి తగదని పలువురు వ్యాఖ్యానించారు. గతంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పత్తిపై కూడా ఇలాగే అకారణంగా మంత్రి సీరియస్ అయ్యారని రెవెన్యూ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.

# ఫేక్ రూ.500 నోట్లు.. ఎలా గుర్తించాలంటే..?

తెలంగాణ ముచ్చట్లు:

ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి చెందిన టెక్నాలజీని మానవాళి మంచికి వినియోగిస్తే మంచిదే. కానీ అదే దుర్వినియోగం అయితే మాత్రం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి ఉంటుంది. బ్యాంక్ అకౌంట్‌లో నగదు వేసి.. ఇంటికి తిరిగి వచ్చేసరికి.. సైబర్ నేరగాళ్ల తమ మాయోపాయంతో వాటిని కొట్టేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో.. సరికొత్త టెక్నాలజీ వినియోగించి రూ.500 దొంగ నోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వీటి విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఈ దొంగ నోట్లు దాదాపుగా అసలు నోట్లను పోలి ఉన్నాయని వివరించింది. చాలా పరీక్షగా గమనిస్తేనే కానీ.. అసలు నోటుకు, నకిలీ నోటుకు తేడా తెలియని విధంగా ఉన్నాయని స్పష్టం చేసింది.

అయితే ఈ దొంగ నోట్లకు, అసలు నోట్లకు మధ్య తేడాను చిన్న స్పెల్లింగ్ ఉందని.. దీనిని ఇట్టే గుర్తించ వచ్చని ప్రజలను సూచించింది. దీనిని గుర్తించడంలో ఇదే కీలకమని పేర్కొంది.కరెన్సీ నోట్లపై సాధారణంగా RESERVE BANK OF INDIA అని ఉంటుందని.. కానీ దానిలో RESERVE అనే పదంలో Eకి బదులుగా A అని ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు స్పష్టంగా పరిశీలించాలని ప్రజలకు సూచించింది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని బ్యాంకులు, సంస్థలు, ఏజెన్సీలను సూచించామని వివరించింది. ఈ విషయంలో ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచించింది. ఇక ఈ సమాచారాన్ని డీఆర్ఐ, సీబీఐతోపాటు ఎన్ఐఏతో సైతం పంచుకున్నట్లు వివరించింది.

# ఉపాధిహామి పథకం పనిదినాల్లో భారీగా కోత విధించిన కేంద్రం

తెలంగాణ ముచ్చట్లు:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధించింది. 202526 ఆర్థిక సంవత్సరానికి 12 కోట్ల పనిదినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా... 6.5 కోట్ల పనిదినాలనే కేంద్రం మంజూరు చేసింది. నిరుడు 8 కోట్ల పనిదినాలు మంజూరు చేయగా.. ఈసారి అందులో 15 కోట్లు తగ్గించింది. డిమాండ్ ఆధారంగా కాకుండా అవసరాల ప్రాతిపదికన పనులు చేపట్టాలంటూ రాష్ట్రానికి రాసిన లేఖలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉపాధి హామీ కింద నాలుగేళ్లుగా రాష్ట్రంలో పెద్దఎత్తున పనులు చేపట్టారు. కేంద్రం ఏటా 8 కోట్ల చొప్పున పనిదినాలు మంజూరు చేస్తుండగా.. వాటికన్నా ఎక్కువ పనులు జరుగుతున్నాయి. 202122లో 10 కోట్లు, 202223లో 10 కోట్లు, 202324లో 11 కోట్లు, 202425లో 12 కోట్ల పనిదినాలు పూర్తి చేశారు. ఈ ఏడాది మాత్రం పనిదినాలను కేంద్రం 6.5 కోట్లకే పరిమితం చేయడంతోపాటు తాము నిర్దేశించిన పనులే చేయాలని ఆంక్షలు విధించింది. నిరుడు పలు జిల్లాల్లో వంద శాతానికి మించి పనులు జరగడాన్ని అనుమానించిన కేంద్ర ప్రభుత్వం... రాష్ట్రానికి ప్రత్యేక బృందాలను పంపి క్షేత్రస్థాయి తనిఖీలు చేయించింది. పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే పనిదినాలను తగ్గించినట్లు తెలుస్తోంది.

**పనిదినాలు పెంచాలని కేంద్రానికి సీతక్క లేఖ**

పనిదినాలను కుదించడంతో పాటు పనులపై ఆంక్షలు విధించడంపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తితో ఉంది. రాష్ట్రంలో రహదారులు, గ్రామ



పంచాయతీ భవనాల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ఉపాధి నిధులను వినియోగిస్తున్నారు. ఈసారి కొత్తగా చేపల కొలనుల నిర్మాణం చేపట్టింది. పనులను కుదిస్తే వాటన్నింటిపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీల గుర్తింపునకు 100 రోజుల పాటు పనిచేసేవారిని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. దీంతో పనులకు వస్తున్న కూలీలు పెరుగుతున్నారు. కొత్తగా జాబ్కార్డులు ఇవ్వాలంటూ పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పనిదినాలు పెంచాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క యోచిస్తున్నారు. మరోవైపు, కేంద్రం కేటాయింపులకు అనుగుణంగా జిల్లాలవారీగా చేపట్టే పనులపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. ఈ ఏడాది మహిళా శక్తి ఉపాధి భరోసా, పొలం బాటలు, ఫల వనాలు, వనమహోత్సవం, జల నిధి, గ్రామీణ పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాలని నిర్ణయించింది. వేతనాలకు రూ.1,625 కోట్లు, మెటీరియల్ కంపోనెంట్కు రూ.1,083 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తూ దస్త్రంపై మంత్రి సీతక్క సంతకం చేశారు.

# నాలుగు రోజులు వైన్స్ బంద్

తెలంగాణ ముచ్చట్లు:

హైదరాబాద్ నగరంలో మందు బాబులకు అలర్ట్. హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు వైన్ షాపులు బంద్ కానున్నాయి. ఈరోజు సాయంత్రం నుండి బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు మందు షాపులు మూసివేయనున్నారు.

ఈనెల 23వ తేదీన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు మద్యం అమ్మకాలు బంద్ కానున్నాయి. వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్స్, క్లబ్‌లలో మద్యం అమ్మకాలు నిలిపివేయనున్నారు. ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఇక, ఈనెల 25వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉంది. కౌంటింగ్ రోజు కూడా వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని పోలీసులు ఆదేశాలు ఇచ్చారు.



# ఆల్‌టైమ్ హైకి చేరుకున్న బంగారం ధరలు

(మొదటి పేజీ తరువాయి)

పసిడి ధరలు పెరిగిన నేపథ్యంలో దీనిపై పెట్టుబడులు చేసిన ఇన్వెస్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కానీ పసిడిని కొనుగోలు చేయాలని చూస్తున్న వారికి మాత్రం ఈ రేట్లు షాక్ ఇస్తున్నాయి.


ఈ బంగారం పెరుగుదల ప్రభావం భారతదేశం మీద కూడా పడింది. ఈ క్రమంలో ఏప్రిల్ 21న సోమవారం రోజు భారతదేశంలో బంగారం ధరలు కూడా పంజుకున్నాయి. గుడ్‌రిటర్న్స్ డేటా ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఇప్పుడు రూ.9,8350కి చేరుకుంది. ఇంకా ఇలానే వృద్ధి కొనసాగితే బంగారం కొనాలనుకున్నవాళ్లు ఇంకొంత ఆలస్యం చేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు ఈ ధరలు ఈ వారంలో లక్ష రూపాయల స్థాయికి చేరుకునే ఛాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

**అసలు ధరలు ఎందుకు పెరుగుతున్నాయ్**

అమెరికా డాలర్ బలహీనపడడం, డొనాల్డ్ ట్రంప్ సుంకాల నిర్ణయం, ఫెడరల్ రిజర్వ్‌తో వివాదం సహా పలు అంశాలు ఈ ధరల పెరుగుదలకు కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా 10 శాతం సుంకాలను విధించగా, చైనాపై 145 శాతం వరకు సుంకాలు విధించారు. దీనిపై స్పందించిన చైనా కూడా అమెరికా వస్తువులపై 125 శాతం సుంకాలను ప్రకటించింది. ఈ క్రమంలో తాము రాజీ పడేది లేదని చైనా అంటోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం-22- ఏప్రిల్ 2025







# యువతకు ఉపాధి కల్పన కోసం మూడంచెల వ్యూహం అమలు....

- 100కు పైగా కంపెనీలలో 5 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహణ
- త్వరలో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు కసరత్తు
- 9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి ప్రోత్సాహం
- యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి
- మధిర పట్టణం రెడ్డి గార్డెన్స్ లో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కోరి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పన కోసం ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్ లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొని, 5 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువత అనేక ఆశలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొనడం జరిగిందని, కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా పాలకులు యువత ను నిర్లక్ష్యం చేశారని, యువతకు ఉపాధి అవకాశాలు చూపించడంలో వైఫల్యం చెందారని అన్నారు.

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మొదట పబ్లిక్ సర్వీస్ కమీషన్ ప్రక్షాళన చేసి జాబ్ కేలండర్ విడుదల చేసామని, మొదటి దశలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, త్వరలోనే మరో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతుందని అన్నారు.

రెండవ దశలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న గ్లోబలైజేషన్ లో భాగంగా వస్తున్న మార్పులను అలవర్చుకొని బహుళ జాతుల సంస్థలకు రాష్ట్రంలో అవసరమైన వనరులు కల్పించి భారీ ఎత్తున పెట్టుబడులు, వీటి ద్వారా యువతకు లక్షల్లో ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నామని అన్నారు.

మూడవ దశలో ఉపాధిని ప్రోత్సహించేందుకు 9 వేల కోట్ల పెట్టుబడితో రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యువతకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నామని, స్వయం ఉపాధి కోసం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించామని అన్నారు.

చదువు పూర్తి చేసుకున్న వారు ఖాళీగా ఉండకుండా, సొంత ఆదాయంతో ముందడుగు వేసేందుకు జాబ్ మేళాలు ఉపయోగపడతాయని, ఇక్కడ ఉద్యోగం పొందిన వారు ఇక్కడితోనే ఆగిపోకుండా ఇది మొదటి మెట్టుగా భావించి వచ్చిన జీతంతో వారి జీవితంలో పెట్టుకున్న గొప్ప లక్ష్యాలను సాధించాలని సూచించారు. నేడు మధిర పట్టణంలో నిర్వహించే జాబ్ మేళా ద్వారా ఒకే రోజు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు.

యువత రాష్ట్రానికి గొప్ప వనరు అని, రాష్ట్ర జిడిపి పెరుగుదలకు, కుటుంబ బాగు కోసం, సమాజానికి పెద్ద ఎత్తున యువత ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. ఖాళీగా ఉండే యువత సంఘ విద్రోహ శక్తులకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, చివరి వయసులో తల్లిదండ్రులను బాధపడకుండా చూసుకోవాలని, యువత సన్మార్గంలో నడిచేందుకు జాబ్ మేళాలు ఉపయోగపడతాయని అన్నారు.

రాష్ట్రంలోని యువతకు అవసరమైన స్కిల్ అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటిఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గా అప్ గ్రేడ్ చేసిందని అన్నారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే ఆలోచనతో 60 యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణానికి ఒకేసారి 11 వేల 600 కోట్ల నిధులను కేటాయించిందని, ఈ పాఠశాలల ద్వారా నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుబాటులోకి వస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అప్ గ్రేడ్ చేసి అన్ని వసతులు కల్పిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించేందుకు మనపై నమ్మకం ఉండడం చాలా ముఖ్యమని, చిన్న ఉద్యోగమైన మనం చేరితే మనలో విశ్వాసం పెరుగుతుందని, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇది తోడ్పాటు అందిస్తుందని అన్నారు.

యువతకు వచ్చిన అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, జాబ్ మేళాలో వచ్చిన ఉద్యోగాల్లో ఎటువంటి సమస్య వచ్చినా అవసరమైన సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. మెగా జాబ్ మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సీఎంకు ఇంచార్జి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెగా జాబ్ మేళా లో 5300 మంది యువత దరఖాస్తులు చేసుకోగా, 2300 మందిని వివిధ కంపెనీలు నియామక ఉత్తర్వులు అందజేశాయి. ఈ మెగా ఉద్యోగ మేళాలో సింగరేణి జనరల్ మేనేజర్ సాలీం రాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు, యువత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ కి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు బానోతు నాగేశ్వరరావు
- రఘునాథపాలెం మండలాని పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించండి
- గ్రీవెన్స్ లో ప్రాజెక్ట్ అధికారికి, బి రాహుల్ కి వినతి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ కు ప్రత్యేక నిధులు కేటాయించి గిరిజన రైతులకు, బోరుబావులు, విద్యుత్ మోటర్లు, విద్యుత్ సౌకర్యము కల్పించాలని, సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రఘునాథపాలెం మండలం గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం, గిరిజనులు ఎక్కువగా వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు కూరగాయలు ఎక్కువగా పండిస్తారు అని అన్నారు, గత ఏసంగి పంటలు నీటి సౌకర్యం లేనందున, కూరగాయలు మొక్కజొన్న, వరి, వంటి యాసంగి పంటలు ఎండిపోయాయని ప్రాజెక్ట్ అధికారికి తెలియజేశారు.సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించడం పట్ల అర్హులైన గిరిజన రైతులు వసతులు కల్పించాలని ఆయన కోరారు.



# విద్యార్థులు ధైర్యంగా ఉండాలి

- అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు కె. బ్రహ్మం

**మెదక్ బ్యూరో,అల్లాదుర్గం: తెలంగాణ ముచ్చట్లు,**



విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చిన, ఫెయిల్ అయిన ధైర్యంగా ముందుకు సాగాలని అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బ్రహ్మం సూచించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో గెలుపు, ఓటమి సహజమని మనం ధైర్యంతో ఉండడం అలవర్చుకోవాలని, జ్ఞానాన్ని ఓర్పును .. పెంచుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. పదవ తరగతి ఇంటర్ ఫెయిల్ అయిన వాళ్ళ ఎంతోమంది దృఢ సంకల్పంతో చదువులో రాణించి ఐఏఎస్, ఐపీఎస్ తో పాటు ఉన్నత ఉద్యోగాలు సాధించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. పడి లేచిన కెరటాన్ని ఆదర్శంగా తీసుకుని మళ్లీ ప్రయత్నించడం నేర్చుకోవాలని కోరారు. విద్యార్థులు బాధపడకుండా పనికిరాని ఆలోచనలు చేయకుండా ధైర్యంగా ఉండాలని, ఇంకా బాగా చదివి మళ్లీ పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆయన కోరారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో 20 సంవత్సరాలు జైలు శిక్ష

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**

హనుమకొండలోని వడ్డేపల్లి చర్చి సమీపంలోని ఎస్ డి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న మైనర్ బాలికపై లైంగిక దానికి పాల్పడిన వ్యక్తికి హనుమకొండ అదనపు జిల్లా జడ్జి అపర్ణాదేవి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని హసన్ పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్ డి పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న ఘనపురం మండలం రవి నగర్,జయశంక్ భూపాలపల్లికి చెందిన ఆకుల సాంబ (34)అదే పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకొని ప్రేమిస్తున్నానని నమ్మించి అభం శుభం తెలియని బాలికను వేములవాడ తీసుకువెళ్లి సత్రంలో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. చివరికి జరిగిన మోసం గ్రహించిన బాలిక సీతంపేటలోని తన మామకు తెలుపగా హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో నిందితుడిపై ఫిర్యాదు చేశారు. అప్పటి కాజీపేట ఏసిపి రవీంద్ర కుమార్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సాక్షదారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షుల్ని విచారించిన న్యాయమూర్తి అపర్ణాదేవి నేరం రోజు అయిందని భావించి నిందితుడు ఆకుల సాంబకు 20 సంవత్సరాల కఠిన కారగార శిక్షతోపాటు 20వేల జరిమానా విధించారు. తల్లిని కోల్పోయి నిందితుని చేతిలో అఘాయిత్యానికి గురైన బాలిక భవిష్యత్తు కోసం 4 లక్షల ఆర్థిక సహాయాన్ని బాలికకు ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. ఈ కేసు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి వాదించగా కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వలబోజు రవీందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారని తెలియజేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 673 వాహనదారులు...

- వాహనాలు నడుపుతున్న 21 మంది మైనర్ డ్రైవర్లపై కేసులు నమోదు
- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



ఏప్రియల్ 20 రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన 673 మందితో పాటు నిబంధనలు విరుద్ధంగా రోడ్లపై వాహనాలు నడుపుతున్న 21 మంది మైనర్ డ్రైవర్లపై కేసులు నమోదు చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోవడం, ప్రమాదాల బారిన పడడమే కాకుండా కుటుంబాలకు శిక్ష వేసిన వారు అవుతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాల నడుపుతూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యల కోసంన్యాయస్థానంలో హాజరుపరుస్తున్నామని పెర్కొన్నారు. ఇప్పటికే పలువురికి ఒక రోజు చొప్పున జైలు శిక్ష/ జరిమానా విధించడం జరిగిందన్నారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా శని, ఆది వారాలలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో అయా రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఇటీవల నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా..వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా గౌరవ న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీలపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుయని, మైనర్లు ఎవరూ కూడా వాహనాలు నడపవద్దని సూచించారు.



# సెంట్రల్ లైటింగ్ సిస్టంతో పాటు డివైడర్ ఏర్పాటు చేయాలి

## హసన్ పర్తి అభివృద్ధి కమిటి

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు.**

హసన్ పర్తి అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి జన్ను కిషన్,కన్వీనర్ పెద్దమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వరంగల్ నగర కార్పొరేషన్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. హసన్ పర్తి ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఎల్లాపూర్ బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ సిస్టం తో పాటు డివైడర్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఈ మధ్య జరిగిన వరస రోడ్డు ప్రమాదాలలో పదుల సంఖ్యలో ప్రయాణికుల మరణించారని తక్షణమే రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాలని కోరడంతో పాటు అత్యధిక జనాభా కలిగి ఉన్న హసన్ పర్తి పట్టణానికి ఉమ్మడి స్మశాన వాటిక లేకపోవడంతో రోడ్డు ప్రక్కన దహనసంస్కరాలు చేస్తున్నారని గతంలో చాలాసార్లు నగర కార్పొరేషన్ దృష్టికి,ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అయినా అభివృద్ధి పనులు జరగడంలేదని తక్షణమే ఉమ్మడి స్మశాన వాటికకు సంబంధించిన పనులు ప్రారంభించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కోశాధికారి జనగాం ప్రశాంత్, ఉపాధ్యక్షుడు పెద్దమ్మ క్రాంతి కుమార్, కార్యదర్శి పెద్దమ్మ ప్రశాంత్,సభ్యుడు కర్ణకంటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

- ఖిల్లా ఘనపురం మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



ఈ నెల 27వ తేదీన, వరంగల్ లోని, ఎల్కతుర్తి వద్ద నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఖిల్లా ఘనపురం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరంగల్ లో ఈనెల 27న(ఆదివారం) నిర్వహించనున్న, బిఆర్ఎస్ రజతోత్సవ ఆవిర్భవ సభను విజయవంతం చెయ్యాలని ఆర్.కృష్ణయ్య పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వరంలో, వనపర్తి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సూచన మేరకు, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నామని అన్నారు. 24 సంవత్సరాల క్రితం స్థాపించిన బిఆర్ఎస్ 24 వసంతాలు పూర్తి చేసుకొని, 25 వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా, బిఆర్ఎస్ వరంగల్ లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు, ప్రతి ఇంటి నుండి ఒక్కరు తప్పకుండ రావాలని, లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని అన్నారు. ఘనపూర్ మండలం లో, మొదట బిఆర్ఎస్ ఉద్యమం నలుగురితో మొదలు అయి, నేడు గ్రామాల్లో మండల వారీగా, జిల్లాస్థాయి వరకు ప్రతి కార్యకర్త సైనికుల పని చేస్తున్నారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ మొదటి వార్షికోత్సవ సభ నల్గొండ లో పెట్టి సూపర్ సక్సెస్ అయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విద్యార్థుల పాత్ర ప్రత్యేక స్థానం ఉందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించారు అని గుర్తు చేశారు. అధినేత కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమిస్తే, పోరాటం మరో స్థాయికి చేరుకుందన్నారు. నాడు ఇద్దరు ఎంపీలతో కెసిఆర్ తెలంగాణ సాధించు వచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో అభివృద్ధి చేసిన చరిత్ర కేసీఆర్ దేనని, దాన్ని పాడు చేసే ఆలోచనతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మనస్పర్ధలు లేకుండా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల పని చేయ్యాలని, మీ వెంటే ఉంటామని చెప్పారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే బిఆర్ఎస్ మండల కమిటీకి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి, మండల పరిధిలో అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయ్యాలని ఖిల్లా ఘనపురం మండల బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ రాళ్ల కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# ఖమ్మం లో నకిలీ చికిత్సలతో సీఎంఆర్ఎఫ్ నిధుల దుర్వినియం



- ఖమ్మంలో 10 ప్రైవేట్ ఆసుపత్రుల మూసివేతకు ఉత్తర్వులు.

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ఎఫ్) నిధులను దుర్వినియోగం చేసిన ఘోర అవినీతి స్కాం క్రమంగా వెలుగులోకి వస్తోంది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 10 ప్రైవేట్ ఆసుపత్రులు నకిలీ కేస్‌షీట్లు బిల్లుల ఆధారంగా వేలాది రోగులకు చికిత్స చేసినట్టు కోట్లకు పైగా నిధులు అక్రమంగా వసూలు చేశాయని సమాచారం.

**ఖమ్మం లో మూసివేత ఉత్తర్వులు అందుకున్న పది ఆసుపత్రులు**

1) శ్రీ వినాయక హాస్పిటల్
2) శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
3) శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
4) వైష్ణవి హాస్పిటల్
5) సుజాత హాస్పిటల్
6) ఆరెంజ్ హాస్పిటల్
7) న్యూ అమృత హాస్పిటల్
8) మేఘశ్రీ హాస్పిటల్
9) డాక్టర్ జే. ఆర్. ప్రసాద్ హాస్పిటల్
10) గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్.

వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వుల మేరకు ఆసుపత్రుల మూసివేత చర్యలు తీసుకుంటున్నట్లు డిఎంహెచ్ఓ కళావతి భాయి తెలిపారు

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: చొల్లేటి రాజేష్ తెలుగు దిన పత్రిక



## ఖమ్మం ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- 35 మందికి రూ.11.23 లక్షల మేరకు లబ్ధి

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్ళలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన చెక్కులను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంపు కార్యాలయంలో 35 మందికి రూ.11.23 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు చెందిన ప్రజలకు లబ్ధి చేకూరింది. సందర్భంగా ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ అనేది పేదలకు వరం లాంటిదని తెలిపారు. అందుకే.. వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం చెక్కులు మంజూరు చేస్తోందని, అవవకాశాన్ని అర్హులైన పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో.. మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు హరినాధ బాబు, తిరుమలాయపాలెం కాంగ్రెస్ మండల అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నాయకులు కన్నెబోయిన సీతారామయ్య, అనంత రెడ్డి, ముస్తఫా, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, మంకేన వాసు, లింగాల రవి, కాంపాటి వెంకన్న, పాపా నాయక్, కానుగుల రాధాకృష్ణ, దేగల ఉపేందర్, బాణోత్ హరినాథ్, ఊటుకూరి రంజిత్, గడ్డం శ్రీకళా రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## రైతుల భూములను, కాలువను నాశనం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు.



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజోత్సవ సభ ఏర్పాట్ల పేరు మీద రైతులకు చెందిన భూములను దేవాదుల ఆయకట్టు ద్వారా వచ్చే కాలువలను ధ్వంసం చేస్తూ, విచ్చలవిడిగా పంట పొలాలను చెడగొడుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే మండిపడ్డారు.సోమవారం రోజున కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు సరిహద్దు గ్రామాల ప్రజలతో స్వయంగా సభాస్థలాన్ని పరిశీలించారు.వర్ధన్నపేట నియోజకవర్గం హసన్ పర్తి మండల అనంతసాగర్ గ్రామ శివారు, హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి గ్రామ శివారు లోని మైసమ్మ వాగు మండల, గ్రామాల మధ్య హద్దులను సభ కోసం తీసివేయడం దుర్మార్గమైన చర్య అని ప్రభుత్వం సభ కోసం పర్మిషన్ ఇచ్చిన దానికంటే ఎక్కువగా అవసరానికి మించి రైతుల భూములను చెడగొడుతూ రాక్షసానందం పొందడం బిఆర్ఎస్ పార్టీకే చెందుతుందని అన్నారు.ఏ రోజు కూడా బిఆర్ఎస్ పార్టీ నిర్వహించే సభను అడ్డుకుంటామని ఏ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూడా హెచ్చరించలేదు, కానీ ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఇంకా అధికార పార్టీగా ఉన్నట్లు హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్థానిక పారిశ్రామికవేత్తలను భయభ్రాంతులను చేసి సభ కోసం విరాళాలు ఇవ్వాలని కోరడం సిగ్గుచేటని ఉద్యమ పార్టీ అనే గొప్పలు చెప్పి సభల పేరు మీద కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తూ బడ వ్యాపారవేత్తలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను వాడుకోవడం దిక్కుమాలిన చర్య అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు, రైతుల భూములను, గ్రామాల సరిహద్దు లను అనుమతులు లేకుండా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, స్థానిక ఎమ్మార్వో, ఇరిగేషన్ సంబంధిత శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి,ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, ఎల్కతుర్తి మండల పార్టీ అధ్యక్షుడు ఇంద్రసేనరెడ్డి, అశోక్ రెడ్డి, హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ భూ భారతి చట్టంతో న్యాయం



### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ బ్యూరో / టేక్మాల్ ఏప్రిల్ 21: తెలంగాణ ముచ్చట్లు,

భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.

సోమవారం, జిల్లాలోని టేక్మాల్ మండలాల్లోని రైతు వేదికల్లో భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డిఓ రమాదేవి,తాసిల్దార్ తులసీరామ్, ఎంపీడీవో విటల్, వ్యవసాయ అధికారి రాంప్రసాద్, సంబంధిత, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు రైతులతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా భూముల రికార్డులు పారదర్శకంగా నిర్వహించి, భవిష్యత్ తరాలకు భూ హక్కుల విషయంలో స్పష్టత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూమి కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ధరణిలో పలు భూ సమస్యల పరిష్కారానికి అవకాశాలు లేవని, అలాంటి ఈ భూ భారతి చట్టం కింద ఎటువంటి భూ సమస్యలు అయినా సరే ఖచ్చితంగా పరిష్కారమవుతాయని తెలిపారు.

భూ కబ్జాలు, అక్రమాలు, వివాదాలను తొలగించి, రైతులకు భద్రత కల్పించేందుకు ఈ చట్టం కీలకంగా పనిచేస్తుందన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా ఈ భూ భారతి చట్టంలో ఎలాంటి అవకాశాలు ఉన్నాయో తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందని, అదే ఈ అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రథమంగా ఈ చట్టంలోని సెక్షన్ 4 (4) ప్రకారం ఎవరైనా రైతుల భూమికి సంబంధించి రికార్డులో లేకున్నా, తప్పుగా ఉన్నా, రికార్డు వేరే పేరు మీద ఉన్నా కానీ, లేదంటే సర్వే నంబర్ మారిపోయినా, అటువంటి సమస్య కలిగిన వారు తహసీల్దార్ లకు దరఖాస్తు చేసుకొని, ప్రతిపక్ష వ్యక్తిపై అప్పీల్ చేసుకుంటే, ఈ మేరకు వారిని విచారించి,తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

అలాగే ఈ చట్టం ద్వారా సేల్ డీడ్ కింద పూర్తి వివరాలను ప్రస్తావించవచ్చని,భూముల సర్వే మ్యాపు, సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించిందని, రెండంచెల అప్పీల్ పద్ధతి భూ భారతిలో ఉందని, భూ భారతి ద్వారా 30 రోజుల్లో మ్యుటేషన్ చేయకపోతే 31వ రోజు స్వయంచాలికంగా (ఆటోమేటిక్) మ్యుటేషన్ జరుగుతుందని, నిషేధిత భూములు, కోర్టు కేసుల్లో ఉన్న భూములన్నింటికి భూ భారతిలో పరిష్కారానికి అవకాశం ఉందని వెల్లడించారు.ఈ చట్టం అమలుతో భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలకు స్థానం ఉండదన్నారు. అంతకుముందు సదస్సుకు వచ్చిన రైతులు, తమ సందేహాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో గ్రామ స్థాయిలో సర్వేలు ఎలా జరుగుతాయో, భూ నక్షా పునర్నిర్మాణ ప్రక్రియ ఎలా ఉంటుందో వారు వివరించారు.

ఈ అవగాహన సదస్సులో కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్, ఎంపీడీవో విట్టల్, డిప్యూటీ తాసిల్దార్ కిషోర్ ,ఆర్ఐ సాయి శ్రీకాంత్, ఏపీఓ పౌలు, ఎంపీఓ రియాజ్ దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగలి సంగమేశ్వర్ ,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాన్ కిషన్, విట్టల్ గౌడ్, మల్లారెడ్డి, పాపయ్య, షేక్ మజర్, కిషోర్, లక్ష్మణ్, సంగమేశ్వర్ గౌడ్, మహేష్ రెడ్డి, రాజు గౌడ్, అంజయ్య, రాజశేఖర్, సర్దార్, చందర్, రాజేష్, సాయి శేషు, రవీందర్, నాగరాజు, ఎల్లయ్య, మాణ్యేయ్య, హనుమంత్ ,రైతులు, రైతు సంఘాల, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషి ఫలితమే





- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,

మారుమూల మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడానికి కారణమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలో సోమవారం ఎల్లుపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రంలో కలియతిరిగి వైద్య సేవలు ,వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ. వైద్య పరంగా విద్యాపరంగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సలహాలు సూచనలు మార్గదర్శికంగా పనిచేస్తున్నాయని తద్వారా వైద్య సేవలు విస్తృతం పరిచి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆందోల్ నియోజకవర్గంలో అల్లాదుర్గ్ రేగోడ్, టేక్మాల్ చాలా వెనుకబడిన ప్రాంతాలుగా ఉంటాయని నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని ఇంతకుముందు వైద్య సేవలు పొందడానికి సుదూర ప్రాంతాలకు వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడే వారిని ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందని 20వేల జనాభా ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసుకోవడం ప్రజలకు వైద్య సేవలు ఎంతో మెరుగుపడతాయి జిల్లా కలెక్టర్ అన్నారు. సబ్ సెంటర్ ను అప్ గ్రేడ్ చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు ప్రస్తుతం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనిచేస్తుందని రాబోవు రోజుల్లో 24 గంటలు పనిచేసే ఆరోగ్య కేంద్రం వస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటైన మొదటి రోజే పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించడం మౌలిక వసతులు కల్పించడం పట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ సేవలను కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. ఆరోగ్య కేంద్రాన్ని సక్సెస్ గా రన్ చేయడానికి బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, మెడికల్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మన జిల్లాకు వైద్య ఆరోగ్యశాఖ పరంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని రాష్ట్రం మొత్తంలో మన జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, గణనీయమైన వైద్య సేవలు, వైద్య సిబ్బంది సమయపాలనలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. మొత్తం రాష్ట్రంలోనే సంచలన సృష్టించే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రూపుదిద్దుకోవడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృషి ఎంతో ఉన్నదని చెప్పారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ, వైద్యాధికారులు సిబ్బంది బయటకు వెళ్ళినప్పుడు మూమెంట్ రిజిస్టర్ ద్వారా తెలియపరిచేలా చర్యలు తీసుకున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో సమూలమైన మార్పులు మన జిల్లా నుంచి ప్రారంభం కావడం దీనికి ప్రత్యేకంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగాన్ని మార్గదర్శికంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర సూచనలు సలహాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్ర నాయక్ ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ లు సృజన, అనిలా, హరి ప్రసాద్, వైద్యాధికారిని హర్షిత,సంబంధిత వైద్య సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్.ఏ.క్యూ. ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- రైస్ మిల్లర్లు ధాన్యం తరుగు తీయవద్దు
- ధాన్యం కొనుగోలుపై మిల్లర్లు, అధికారులతో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:





యాసంగి పంట కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా భారత ఆహార సంస్థ నిర్దేశించిన ఎఫ్.ఏ.క్యూ. ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు పాటించని పక్షంలో సదరు కేంద్రాల నిర్వహకులపై చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన ఎఫ్.ఏ.క్యూ. ప్రమాణాలను తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు తరుగు తీయడానికి వీలు లేదని అన్నారు. యాసంగి సీజన్ లో వచ్చే ధాన్యం జిల్లాలోని రైస్ మిల్లులకు అలాట్మెంట్ చేశామని, కొనుగోలు ప్రక్రియకు మిల్లర్లు సహకారం అందించాలని, ప్రతి మిల్లర్ తప్పనిసరిగా ధాన్యం దింపుకోవాలని అన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు పంపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయడానికి వీలు లేదని అన్నారు. ధాన్యం తూర్పారా పట్టిన తర్వాత మాత్రమే రైస్ మిల్లులకు తరలిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో నాణ్యత ప్రమాణాలను వ్యవసాయ విస్తరణ అధికారి సర్టిపై చేయాలని, నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, పౌరసరఫరాల డిప్యూటీ తహసిల్దార్ లు విజయ్ బాబు, సత్యనారాయణ, పవన్ కుమార్, మిల్లర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్, శ్రీరాంసాగర్ పరిశీలనకు ఎన్డీఎస్ఏ

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

శ్రీశైలంతో పాటు నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను పరిశీలించడానికి జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) సమ్మతి తెలిపింది. శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించడానికి వస్తున్న ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్‌ను సాగర్, శ్రీరాంసాగర్‌లు కూడా పరిశీలించేలా విజ్ఞప్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎన్డీఎస్ఏకు తెలంగాణ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్ కుమార్ లేఖ రాశారు. సాగర్, శ్రీరాంసాగర్‌లను పరిశీలించడానికి వీలుగా అదనంగా ఒక రోజు కేటాయిస్తామని, షెడ్యూల్‌ను ఖరారు చేసి, సమాచారం ఇవ్వాలని ఎన్డీఎస్ఏ కార్యాలయం తెలంగాణకు బదులిచ్చింది. ఇదివరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం ఈనెల 28న విజయవాడకు చేరుకొని, ఏపీలో డ్యామ్ సేఫ్టీ అధికారులతో ఏపీ జల



వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో అనిల్‌జైన్ సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఈనెల 29న శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించనున్నారు. 30న హైదరాబాద్‌లో తెలంగాణ అధికారులతో సమావేశం జరగాల్సి ఉండగా... దీన్ని మార్చనున్నారు. 30న నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్‌లను పరిశీలించాక... మే 1న హైదరాబాద్‌లో స్టేట్ డ్యామ్ సేఫ్టీ అధికారులతో సమావేశం అయ్యేలా షెడ్యూల్‌లో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక









# భూ భారతి హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం....

- ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ
- భూ భారతి చట్టంపై ఖమ్మం అర్బన్ మండలం డిపిఆర్సీ భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న నగర మేయర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

భూ సమస్యల పరిష్కారానికి, భూ హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిందని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. స్థానిక డిపిఆర్సీ భవనంలో ఖమ్మం అర్బన్ మండలానికి సంబంధించి సోమవారం భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో నగర మేయర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ పూనుకొల్లు నీరజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భూ హక్కుల రికార్డు సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సవరణ, సాదా బైనామా సమస్యల పరిష్కారం వంటి అవకాశాలు భూ భారతి చట్టంలో ఉన్నాయని, అధికారులు అందించిన ఆర్డర్ పై ఫిర్యాదు ఉంటే అప్పీల్ చేసుకునే వ్యవస్థ ఉందని అన్నారు.

గతంలో ధరణి వ్యవస్థలో ఏవైనా సవరణలు చేయాలంటే రెవెన్యూ అధికారులకు అవకాశం లేదని, కలెక్టర్ కు మాత్రమే అధికారం ఉండేదని, భూ భారతి చట్టం ద్వారా ఇప్పుడు ఇరువురు సవరణ చేయుటకు అవకాశం ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం రూల్స్ ఏప్రిల్ 14, 2025 న తీసుకురావడం జరిగిందని, ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు, భూ భారతి చట్టంలో కొనసాగుతాయని, భూ హక్కులకు సంబంధించి ఫిర్యాదులు ఏవైనా ఉంటే మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

భూ భారతి చట్టం తీసుకొని రావడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చాలా మందితో చర్చించి, డ్రాఫ్ట్ బిల్లుపై ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత తుది భూ భారతి చట్టం కార్య రూపం దాల్చిందని అన్నారు. ప్రతి మండలంలో రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, చట్టంపై వచ్చే సందేహాలు, సూచనలు ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ప్రజల సౌకర్యం కోసం అవసరమైన మార్పులను తీసుకొని వస్తామని అన్నారు. భూ భారతి చట్టం అమలులో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ముందస్తుగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద అమలు చేస్తున్నామని తెలిపారు.

మన జిల్లా నేలకొండపల్లి మండలంలో పైలట్ ప్రాజెక్ట్ జరుగుతుందని, ప్రతి గ్రామం లో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని అన్నారు. భూ హక్కుల నిర్వహణ చాలా కీలకమైన అంశమని అన్నారు.

భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం కీలక అంశాలు, చట్ట ప్రత్యేకతలు, పొందుపర్చబడిన ప్రయోజనాల గురించి అదనపు కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. చట్టంపై రైతులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె. వెంకటేశ్వర రావు, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ రవి కుమార్, ఆర్ఐ లు వహీద్, సాయి నరేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ రూ.500 నోట్లతో జాగ్రత్త..


అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారుచేసిన రూ.500 దొంగనోట్లు (Rs 500 Notes) చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డీఆర్ఐ, ఎఫ్ఐయూ, సీబీఐ, ఎన్ఐఏ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలావరకు అసలు నోట్లులాగే ఉన్నట్లు వెల్లడించింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది.

కాకపోతే ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉందని.. దీనిని గుర్తించడంలో అదే కీలకమని పేర్కొంది. "RESERVE BANK OF INDIA" అనే దానిలో "RESERVE" పదంలో 'E' బదులు 'A' పడినట్లు వెల్లడించింది. ఈ చిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చరించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తించడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.



# ఏఐతో నిరుద్యోగ తుపాను..

ఈ సాంకేతిక యుగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఇప్పటికే ఏఐ ఆధారిత ఆటోమేషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో వేగంగా పనులు పూర్తవుతున్నా.. కొన్ని సమస్యలూ లేకపోలేదు. ముఖ్యంగా ఏఐ రాకతో ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. తాజాగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. కృత్రిమ మేధతో రాబోయే రోజుల్లో కోట్లాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని అన్నారు. ఫలితంగా నిరుద్యోగం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు.




**రెండు, మూడు రోజులైనా పనిచేయగలమా? బిల్‌గేట్స్**

"ఇది ఏఐ యుగం.. జ్ఞానంపై సమాజం దృక్కోణాన్ని సమూలంగా మార్చే శకం. ఇప్పటివరకు గొప్ప గొప్ప డాక్టర్లు, టీచర్ల మేధ అద్భుతం అని కొనియాడాం. కానీ, ఏఐ రాకతో రాబోయే దశాబ్ద కాలంలో వీరికి ఉండే జ్ఞానం ఉచితంగా, అందరికీ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం మన జనాభాకు సరిపడా వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. దీంతో ఏఐతో లభించే మెడికల్ సలహాలు, టీచింగ్ క్లాస్‌లు అందరికీ నచ్చుతాయి. కానీ, ఇది కాస్త భయానకమైన విషయం. ఇదంతా పక్కనబెడితే.. మరి ఉద్యోగాల సంగతేంటీ? కనీసం వారానికి రెండు, మూడు రోజులైనా పని చేయగలమా?" అని బిల్‌గేట్స్ అన్నారు. అయితే, కొన్ని విషయాల్లో ఏఐ సమస్యలను పరిష్కరిస్తోందని టెక్ దిగ్గజం తెలిపారు. కృత్రిమ మేధతో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని, పనులు వేగవంతమవుతున్నాయని పేర్కొన్నారు.


**వందేళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితి: ఒబామా**

"సాంకేతికత పెరిగే కొద్దీ.. ఏఐ మరింత ప్రభావవంతంగా, వేగంగా అందుబాటులోకి వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఆటోమేషన్‌కు అడ్వాన్స్‌డ్ వెర్షన్. అయితే, కేవలం తయారీ రంగాన్ని మాత్రమే ఆటోమేటిక్ చేయట్లేదు. రోబో చేతులను ఉపయోగించినట్లు కాదు. ఉన్నత స్థాయి మేధోపరంగానూ అనేక పనులు చేస్తోంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలపర్లు చేసే 70శాతం పనులను ఏఐ చేయగలదు. నిపుణులైన ఉద్యోగులు, మంచి జీతభత్యాల గురించి మాట్లాడుకునేటప్పుడు ఏఐ రాక కాస్త గందరగోళానికి గురి చేస్తుంది. కృత్రిమ మేధ వినియోగం పెరిగితే చాలా ఉద్యోగాలు గల్లంతే. వందేళ్లలో ఎన్నడూ చూడని పరిస్థితి రావొచ్చు. బ్లూ కాలర్ ఉద్యోగులే కాదు, చాలా మంది ఆందోళనకు గురవుతారు. ఉద్యోగం ఎలా? కుటుంబాన్ని పోషించేందుకు ఆదాయం ఎలా? ఇలాంటి ప్రశ్నలు తలెత్తుతాయి" అని ఒబామా వివరించారు. వీరి అభిప్రాయాలపై సోషల్ మీడియాలోనూ చర్చ మొదలైంది. "ఇలాంటి భవిష్యత్తునేనా మనం కోరుకునేది? విద్య, ఆరోగ్య రంగాల్లో మనిషి ప్రతిభను మెషిన్లు భర్తీ చేయగలవా?" అని యూజర్లు ప్రశ్నిస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన అంశమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఏడాదికి 80 లక్షల ఉద్యోగాల సృష్టి

వచ్చే 1012 ఏళ్లలో, ఏడాదికి కనీసం 80 లక్షల ఉద్యోగాలను భారత్ సృష్టించగలదని భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో తయారీ రంగ వాటాను పెంచడం ద్వారా, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. దీన్ని సాధించాలంటే బాహ్య పరిస్థితులు అతి పెద్ద సవాలుగా ఉన్నాయని తెలిపారు. కొవిడ్ తర్వాత తయారీ రంగంలో చైనా ఆధిపత్యం సాధించిందని, అదే తరహాలో జీడీపీలో తయారీ రంగ వాటాను పెంచుకోవాలని భారత్ చూస్తోందని తెలిపారు. కొలంబియా విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో భారతీయ ఆర్థిక విధానాలపై నిర్వహించిన 'కొలంబియా ఇండియా సమ్మిట్ 2025'లో అనంత నాగేశ్వరన్ మాట్లాడారు. 'కృత్రిమ మేధ, సాంకేతికత, రోబోటిక్స్ వంటివి ఈ ప్రయాణంలో కీలకపాత్ర పోషిస్తాయి. మన దేశం పరిమాణం పరంగా, భారీ సంక్లిష్ట సవాళ్లను అధిగమించాలి. మనం సృష్టించాల్సిన ఉద్యోగాల సంఖ్యను పరిశీలిస్తే, ఏడాదికి 80 లక్షలుగా ఉన్నాయి. కృత్రిమ మేధ అనేది ప్రారంభ స్థాయి ఉద్యోగాలను తీసివేయడంలో పెద్ద పాత్ర పోషించే అవకాశం ఉంది. తక్కువ ఐటీ ఆధారిత సేవల ఉద్యోగాలు కూడా ముప్పులో పడొచ్చ'ని ఆయన తెలిపారు.

# స్టీల్ దిగుమతులకు చెక్



దేశీయ స్టీల్ పరిశ్రమ ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక చర్య తీసుకుంది. హెచ్‌ఆర్ కాయిల్స్, షీట్లు, ప్లేట్లు, సీఆర్ కాయిల్స్, షీట్లు వంటి ఐదు రకాల స్టీల్ దిగుమతులపై వాటి విలువపై 12 శాతం చొప్పున సేఫ్‌గార్డ్ డ్యూటీ పేరుతో ప్రత్యేక దిగుమతి సుంకం విధిస్తున్నట్టు ప్రకటించింది. ఇందుకోసం ఈ స్టీల్ ఉత్పత్తుల కనీస దిగుమతి ధరను టన్నుకు 675 డాలర్ల నుంచి 964 డాలర్లుగా నిర్ణయించింది. ఈ ధర కంటే తక్కువ ధరకు దిగుమతి అయ్యే స్టీల్ ఉత్పత్తులకు మాత్రమే ఈ 12 శాతం సుంకం వర్తిస్తుంది. ఈ సుంకం 200 రోజుల పాటు అమల్లో ఉంటుంది. చైనాతో సహా వివిధ దేశాల నుంచి చౌక గా వచ్చిపడే దిగుమతులకు చెక్ పెట్టేందుకు కేంద్రం ఈ చర్య తీసుకుంది.

## కారం పొడి చల్లి.. కట్టేసి..

# మాజీ డీజీపీ హత్య

కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ (68) దారుణ హత్య కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆస్తి వివాదాలు, కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యే హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ ఘటనలో మరికొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఓం ప్రకాశ్, ఆయన భార్య పల్లవి గొడపడ్డారు. అది తీవ్రరూపం దాల్చడంతో పల్లవి ఆయనపై కారప్పొడి చల్లి, కట్టేసిందని, తర్వాత అతడిని పొడిచి చంపిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఆమె ఒక గ్లాస్ బాటిల్‌ను ఉపయోగించిందని చెప్పారు. తర్వాత నిందితురాలు మరో పోలీసు అధికారి భార్యతో మాట్లాడారు. తన భర్తను తానే చంపేసినట్లు చెప్పారు. దాంతో వెంటనే ఈ ఘటన పోలీసుల దృష్టికి చేరింది.



**'నేను చనిపోయాక న్యాయం జరగకుంటే'.. ఇంజినీర్ ఆత్మహత్య**

ఓం ప్రకాశ్ తన బంధువుకు ఒక ఆస్తిని బదిలీ చేశారని, ఆ విషయంలో జరిగిన గొడవే ఈ పరిస్థితికి దారితీసిందని సంబంధిత వ్యక్తులు వెల్లడించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హత్యలో మృతుడి కుమార్తె పాత్రపై ఆరా తీస్తున్నారు. పల్లవి గత 12 ఏళ్లుగా స్కిజోఫ్రీనియాతో బాధపడుతోందని, చికిత్స కూడా పొందుతోందని ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు తనభర్త నుంచి ప్రమాదం ఉందని తరచూ భయపడేదని, ఊహాజనితమైన ఆలోచనలతో ఆందోళనకు గురయ్యేదని తెలిపారు.

1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఓం ప్రకాశ్ బిహార్‌లోని చంపారన్‌కు చెందిన వ్యక్తి. 2015 మార్చి 1న కర్ణాటక డీజీపీగా బాధ్యతలు చేపట్టి, 2017లో పదవీ విరమణ పొందారు. అనంతరం బెంగళూరులోని హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్‌లో నివసిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన భార్య పల్లవి ఇచ్చిన సమాచారంతో ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఓం ప్రకాశ్ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించారు. చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

# చమురు దిగుమతులు జూమ్..

మన దేశ చమురు దిగుమతులు ఏటికేటికి పెరిగిపోతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (202425) భారత్.. విదేశాల నుంచి 24.24 కోట్ల టన్నుల ముడి చమురు దిగుమతి చేసుకుంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (202324)తో పోలిస్తే ఇది 4.2 శాతం ఎక్కువ. 202425 ఆర్థిక సంవత్సరంలో మన మొత్తం చమురు అవసరాల్లో 89.1 శాతం దిగుమతుల ద్వారానే భర్తీ అయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది అర శాతం ఎక్కువ. ఇదే సమయంలో దేశీయ చమురు ఉత్పతి మాత్రం 2.94 కోట్ల టన్నుల నుంచి 2.87 కోట్ల టన్నులకు పడిపోయింది.




పెరిగిన భారం: 202425 ఆర్థిక సంవత్సరంలో చమురు, పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి బిల్లు 15,630 కోట్ల డాలర్ల నుంచి 16,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.13.76 లక్షల కోట్లు) చేరింది. ఇదే సమయంలో గ్యాస్ దిగుమతులూ 15.4 శాతం పెరిగి 3,669.9 కోట్ల ప్రామాణిక ఘనపు మీటర్ల (ఎంఎంఎస్‌సీఎం)కు చేరాయి. కాగా దేశీయ గ్యాస్ ఉత్పత్తి 3,611.3 ఎంఎంఎస్‌సీఎంకు పడిపోయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 0.9 శాతం తక్కువ.

ఇంధన స్టోరేజీలోకి రూ.4.79 లక్షల కోట్ల పెట్టుబడులు: మన దేశ ఇంధన స్టోరేజీ రంగం 2032 నాటికి భారీగా పెట్టుబడులను ఆకర్షించనుంది. ఇది ఎంత లేదన్నా రూ.4.79 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఇండియా ఎనర్జీ స్టోరేజీ అలయెన్స్ (ఐఈఎస్ఏ) అంచనా. 202632 మధ్య కాలంలో ఈ రంగం ఐదింతలు పెరగనుంది. టెక్నాలజీ నవకల్పనలతో గత రెండున్నర సంవత్సరాల్లో నెలకు ఒక మెగావాట్ ఇంధన స్టోరేజీ ఖర్చులు రూ.10 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు తగ్గినట్టు ఐఈఎస్ఏ తెలిపింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: చొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# గుజరాత్‌కు ఆరో విజయం

ఐపీఎల్ 18 (IPL) సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (Kolkata Knight Riders)ను గుజరాత్ టైటాన్స్ (Gujarat Titans) 39 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ సీజన్‌లో విజయాల పరంపర కొనసాగిస్తున్న గుజరాత్ ఆరో విజయం సాధించింది. తొలుత టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 159 పరుగులకే పరిమితం అయింది. ఆ జట్టులో కెప్టెన్ అజింక్యా రహానె (50: 36 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్) టాప్ స్కోరర్. ఆండ్రీ రస్సెల్ (21), రఘువంశీ (27*; 13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), రింకు సింగ్ (17) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్, వాషింగ్టన్ సుందర్, సాయి కిశోర్, ఇషాంత్ శర్మ ఒక్కో వికెట్ తీశారు.

భారీ లక్ష్యఛేదనలో కోల్‌కతాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. రెహ్మనుల్లా గుర్బాజ్ (1)ని సిరాజ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. సునీల్ నరైన్ (17)తో కలిసి రహానె ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరు రెండో వికెట్‌కు 43 పరుగులు జోడించారు. నిలకడగా ఆడుతున్న రహానెను రషీద్ ఖాన్ ఔట్ చేశాడు. అక్కడి నుంచి గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీంతో చాలాసేపు బౌండరీలు రాలేదు. వాషింగ్టన్ సుందర్ వేసిన 11 ఓవర్‌లో తొలి బంతికి రహానె ఫోర్ బాదాడు. కోల్‌కతా ఇన్నింగ్స్‌లో 34 బంతుల తర్వాత వచ్చిన బౌండరీ ఇది. అదే ఓవర్‌లో రహానె సిక్స్ కొట్టి అర్ధ శతకానికి చేరువయ్యాడు. ఈ క్రమంలో వెంకటేశ్ అయ్యర్ (14)ని సాయి కిషోర్ వెనక్కి పంపాడు. 36 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న రహానె సుందర్ బౌలింగ్‌లో స్టంపౌటయ్యాడు. తర్వాత వచ్చిన రస్సెల్, రింకు సింగ్ కూడా ధాటిగా ఆడలేకపోయారు. రస్సెల్‌ను రషీద్ ఔట్ చేయగా.. రమణ్‌దీప్ (1), మొయిన్ అలీ (0)ని ప్రసిద్ధ్ ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపాడు. ఇషాంత్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో రింకు.. గిల్‌కు చిక్కాడు. రఘువంశీ పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు శుభ్‌మన్ గిల్ (90: 55 బంతుల్లో 10 ఫోర్లు, 3సిక్స్‌లు), సాయి సుదర్శన్ (52: 36 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 114 పరుగులు జోడించారు. సుదర్శన్ 33 బంతుల్లో, గిల్ 34 బంతుల్లో హాఫ్ సెంచరీలు అందుకున్నారు. వీరిద్దరూ ఒకే ఓవర్‌లో అర్ధ శతకాలు అందుకోవడం విశేషం. గత మ్యాచ్‌లో చెలరేగిన జోస్ బట్లర్ (41*; 23 బంతుల్లో 8 ఫోర్లు) ఈ మ్యాచ్‌లోనూ విరుచుకుపడ్డాడు. రాహుల్ తెవాతియా (0) డకౌటయ్యాడు. షారుక్‌ఖాన్ (11*) పరుగులు చేశాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, రస్సెల్ తలో వికెట్ పడగొట్టారు.




# హెచ్‌సీఏకు హైకోర్టు ఎదురు దెబ్బ..

తెలంగాణ హైకోర్టులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎదురు దెబ్బ తగిలింది. హెచ్‌సీఏలో జరుగుతున్న అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో ఇటీవలే పిటిషన్ దాఖలు చేసింది.

ఈ పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకోవద్దని హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్‌కు ఆర్డర్స్ జారీ చేసింది. స్టాఫ్ జీతాలు మినహా ఎలాంటి ఆర్థికపరమైన చర్యలు తీసుకోరాదంటూ హెచ్‌సీఏకు హైకోర్టు సూచించింది.

# తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించిన జింబాబ్వే

రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో పర్యాటక జింబాబ్వే కీలకమైన 82 పరుగుల తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 67/1 వద్ద రెండో రోజు ఆటను ప్రారంభించిన జింబాబ్వే మరో 206 పరుగులు జోడించి 273 పరుగులకు ఆలౌటైంది.

జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా.. వికెట్‌కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్డ్ నగరవ (28 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు.

మిగతా బ్యాటర్లలో బెన్ కర్రన్ 18, నిక్ వెల్చ్ 2, కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ 8, వెల్లింగ్టన్ మసకద్జ 6, ముజరబానీ 17, న్యాయుచి 7 పరుగులకు ఔటయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ ఐదు వికెట్లతో చెలరేగగా.. నహిద్ రాణా 3, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

అంతకుముందు జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవండతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద్జ తలో 3.. న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బంగ్లాదేశ్ సొంతగడ్డపై భారీ దెబ్బకొట్టారు. బంగ్లాదేశ్‌కు సొంతగడ్డపై ఇది నాలుగో అత్యల్ప స్కోర్.

బంగ్లా ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (56) అర్ధ సెంచరీతో రాణించగా.. కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (40), జాకిర్ అలీ (28), మహ్మదుల్ హసన్ రాయ్ (14), షద్మాన్ ఇస్లాం (12), హసన్ మహమూద్ (19) రెండంకెల స్కోర్లు చేశారు. స్టార్ ప్లేయర్ ముష్ఫికర్ రహీం 4, మెహిది హసన్ మిరాజ్ 1, తైజుల్ ఇస్లాం 3, నహిద్ రాణా డకౌటయ్యారు. ఖలీద్ అహ్మద్ 4 పరుగులతో అజేయంగా నిలిచాడు.



# ‘రైడ్-2’ అప్డేట్ ఇచ్చిన హాట్ బ్యూటీ..

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవ్‌గణ్ , వాణి కపూర్ జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘రైడ్-2’. ఈ హైలీ యాంటిసిపేటెడ్ చిత్రాన్ని రాజ్ కుమార్ గుప్తా తెరకెక్కిస్తుండగా.. క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతుంది. అయితే దీనిని పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషన్ కుమార్, మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2018లో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ ‘రైడ్’ సీక్వెల్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక ఈ మూవీ భారీ అంచనాల మధ్య మే 1న థియేటర్స్‌లోకి రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మూవీ మేకర్స్ వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. తాజాగా, ‘రైడ్-2’ చిత్రానికి సంబంధించిన ఐటమ్ సాంగ్ రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అందరికీ వ్యసనంగా మారే ట్రాక్ రాబోతున్నట్లు తెలుపుతూ ప్రోమో వీడియోను నెట్టింట పెట్టారు. అయితే హనీ సాంగ్ పాడగా.. ఇందులో బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాడేజ్‌అజయ్ దేవ్‌గణ్‌తో చిందులేయనుంది. ఇక ఈ విషయాన్ని తెలుపుతూ ఆమె కూడా ట్వీట్ చేసింది. అయితే ఈ ఫుల్ పాట మాత్రం ఏప్రిల్ 22న విడుదల కాబోతున్నట్లు వెల్లడించింది.





# బిగ్‌బాస్ ఫేం అమర్‌దీప్ న్యూ మూవి షురూ..

బిగ్‌బాస్ షోతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న నటుడు అమర్‌దీప్ చౌదరి కొత్త సినిమా ‘సుమతీ శతకం’ ఘనంగా ప్రారంభమైంది. సన్నీ లియోన్ నటించిన ‘మందిర’ చిత్రంతో విజయం సాధించిన విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో, కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంతో ఎం.ఎం. నాయుడు దర్శకుడిగా తొలి అడుగు వేస్తున్నారు.

ఈ చిత్రంలో అమర్‌దీప్ చౌదరి, సైలీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అమరావతిలోని వైకుంటపురం విలేజ్ టెంపుల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తం కార్యక్రమంలో చిత్ర తారాగణం, సిబ్బందితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముహూర్తం షాట్‌కు క్లాప్ కొట్టగా, వెన్నా సాంబ శివారెడ్డి కెమెరా స్విచాన్ చేశారు.

‘సుమతీ శతకం’ కథను బండారు నాయుడు అందించగా, సుభాష్ ఆనంద్ సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రఫీని హాల్‌స్వామి, ఎడిటింగ్‌ను సురేష్ విన్నకోట నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

# ఆ హీరో ఓ బ్రాండ్ లాంటి వాడు

కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి ‘కేజీఎఫ్’ చిత్రంతో ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. మొదటి మూవీనే హిట్ కావడంతో అమ్మడు రేంజ్ మారిపోయింది. దీంతో అమ్మడుకి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు రావడంతో వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. శ్రీనిధి శెట్టి తెలుగులో బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ ఫుల్ బిజీ బిజీగా మారిపోయింది. ప్రస్తుతం శ్రీనిధి, నాని  కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం ‘హిట్-3’. సైలేష్ కొలనుదర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. అయితే ఈ మూవీ ఘన విజయం సాధించిన ‘హిట్’కు సీక్వెల్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఇక షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మే 1న థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో.. మూవీ మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు. వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నారు. తాజాగా, శ్రీనిధి శెట్టి ‘హిట్-3’ ప్రమోషన్స్‌లో భాగంగా ఆసక్తికర కామెంట్స్ చేసింది. “హిట్-3 స్క్రిప్ట్ నా దగ్గరకు వచ్చిన సమయంలో ఏం ఆలోచించకుండా ఈ సినిమాను అంగీకరించాను. దానికి కారణం.. నాని అంటేనే ఓ బ్రాండ్. కాబట్టి ఆయనతో నటించే చాన్స్ వచ్చినప్పుడు ప్రశ్నలు అడగకుండా అంగీకరించాలి.

అందుకే అలా చేశాను. ఇందులో నేను అర్జున్ సర్కార్ భార్యగా కనిపించబోతున్నాను. అయితే నేను ఎక్కువగా ప్రోమోస్‌లో కనిపంచలేదు. కానీ నా పాత్ర చాలా శక్తివంతమైనది చాలా బాగుంటుంది. నా కెరీర్ మీద ఈ క్యారెక్టర్ చాలా ప్రభావం చూపిస్తుందని కోరుకుంటున్నాను. మీ అందరూ ఆదరిస్తారని భావిస్తున్నా” అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం శ్రీనిధి శెట్టి కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా 10 రోజులు మాత్రమే ఉండటంతో నాని హిట్-3 ప్రమోషన్స్ కోసం మూడు రోజులు ముంబైలోనే ఉండబోతున్నట్లు టాక్. ఆయన ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

